# జీవన రాగం

శ్రీ ఇసుకపల్లి లక్ష్మీనరసింహ శాస్త్రి

ఇది చంద్రాన్ని గురించిన విషయం. చంద్రంబాధపడితే పడవచ్చు. కాని నావుద్దేశం మాత్రం చంద్రాన్ని బాధపెట్టాలనికాదు. ఓ విధంగా ఆలోచిస్తే, చంద్రం నిజంగా బాధపడడేమోకూడ. కారణం, నాకూ చంద్రానికే తెలుసు. ఇతరులకు తాను అనుకుంటున్న దేమిటో తెలియకుండా వుంటే మాత్రం తాను అనుకున్నట్లుగానే చెయ్యగలుగుతాడు. ఇదీ చంద్రంయొక్క మనస్తత్వం కాని యీ నాడు తానుఅనుకుంటున్నది ఖచ్చితంగా సమర్థించేశక్తి అతనిలో అంతర్గతంగానే వుండిపోయింది. బాహాటంగా పైకి చెప్పటానికి మాత్రం సాహసించడు. తాను యేపరిస్థితుల్లోయేమి అనుకున్నాడో యేమి అనుకోవలసి వచ్చిందోకూడా నాకు తెలుసు. కాని అతనిఅభిప్రాయాలకు నేను వ్యతిరేకత ప్రదర్శించలేదు. అందువలనే చంద్రానికి నామీద అనుమానం. తన వుద్దేశం నాకు తెలిసిపోయిందేమోనని, నా మొహం యెదుటకువచ్చి అతని మనస్సులో వున్న విషయాన్ని గురించిన ప్రస్తావన తీసుకురాలేదు ఎప్పటికప్పుడు ఏదో ఫీలయినట్లు నా దగ్గర మొహం వేలాడేస్తాడు. అభిమానం అడ్డురావటం, తన ఆత్మకు వ్యతిరేకంగా సమర్థించుకోవటానికి నానా అవస్థపడటం, తర్వాత సావకాశంగా సంక్షోభపడటం ఇదంతా చూస్తుంటే నాకు చాలా విచారం వేస్తుంది. అందులో చంద్రం నాకుముఖ్యమైన స్నేహితుడు. వడ్లగింజలో బియ్యపుగింజ అసలు విషయంయేంలేదు. "పెళ్ళి చేసుకోను. నేను యిట్లాగేవుండిపోతాను" అని అన్నాడు చంద్రం ఓసారి నాతో.

ఏదో వుద్రేకంలో, మళ్ళాయిక్కడే చంద్రం నామీద విరుచుకు పడతాడు. బాగా ఆలోచించే అన్నాను. వుద్రేకంలో మాత్రంకాదు అని అతని వుద్దేశం. ఆలోచించితే అట్లా యెందుకు అంటాడని నా సందేహం. పోనీ చంద్రం మాటే వప్పుకున్నా, అదిఅన్న మాటవుతేనిజం. దాన్ని చంద్రం కాదనడు. పరిస్థితులు క్రమంగా మారుతూవస్తున్నాయి. కాలం మార్పుతోపాటు అతను నిర్ణయంమార్చుకున్నాడు. ఈ విషయం నాకు తెలిసినట్లే అతనికి తెలీకూడదు. తెలిస్తే అతనికివచ్చిన ప్రమాదం యేమిటో తెలీదు. పెళ్ళి చేసుకోవడంలో దోషమేమిటో నాకు అర్థంకావటం లేదు. పైగాయిప్పుడు కూడ, అతను మొదట అనుకున్న అభిప్రాయాన్నే సమర్థించటానికి నాదగ్గర యేవేవో చెపుతున్నాడు. అవన్నీ నేను నమ్మాలని చంద్రం వుద్దేశం. నేను పూర్తిగా నమ్మలేదని ఓమూల అనుమానం. పైగా నేను నమ్మటంలేదని అతని మొహాన అంటే అతనికి చెడ్డ చిరాకు, వస్తూవున్న మార్పులన్నీ చూస్తున్న నేను యింకోళ్ళ అభిప్రాయాన్ని మోసుకోవలసిన అవసరయేమిటి? మొట్టమొదటయితే అనుమానాలతో యే నిర్ణయానికి రాలేకపోయాను. మనిషిమీద యెంత నమ్మకమున్నా, యేఘడియ యేలాంటిదో యెవరు చెప్పగలరు! ఛీ ! పాడు మనసు. ఏదన్నా అనిపిస్తుంది. ఏదన్నా అనిపించిన తర్వాతమాత్రం వున్న తెలివి తేటలు కాస్తా దాన్ని సమర్థించుకోవటానికి వినియోగపడక తప్పవు ఈ విషయంమీదవుతే నాకు గట్టి నమ్మకంవుంది. చంద్రం యీ సూత్రానికి మినహాయింపు కాదు. అయినా అలాంటి అవస్థ యేమిపట్టింది చంద్రానికి. ఎంతో దర్జాగా చెప్పెయ్యొచ్చు. అసలు యిలాంటి పరిస్థితికి తీసుకురావటానికి కారణం ముమ్మాటికీ సుజాతేనని నొక్కి చెప్పగలను. కాని నలుగురూ పరిహాసంగా నాలుగు మాటలు

అనచ్చు, ఆ సావకాశంలేకపోలేదు. అయినా నేను చెప్పింది అక్షరాలా నిజం. మున్మాటికీ సుజాతే కారణం.

లా ప్యాసయింది. ప్రాక్టీసుచేస్తోంది. మాటకారి. చలాకీ మనిషి. ఎంతైనా అంతపట్టుదలగల మనిషిని నేనుయెక్కడా చూడలా. ఎవరికో వకరికి భార్యగా వుండటమేమిటి పరమార్థం! ఎంత అవమానకరమైన విషయం.! అందులో లాయరు ఒకమగవాడిక్రింద తొత్తుగావుండటమా! భార్య అంటే సుజాత నిర్వచనమూ అదే. తనకు కావలసినవాళ్ళందరూ చెప్పారు. తన హితం కోరే వారందరూ సలహాలు యిచ్చారు. అందర్నీ తేలికగానే జమకట్టేసింది. ఊళ్ళో వాళ్ళందరికి తన పెళ్ళివిషయం యెందుకో! పెళ్ళిళ్ళు చేసుకుని లాగుకుంటున్నారుగా. వట్టిమూర్ఖులు, పశుజాతి, పెళ్ళి చేసుకుని పిల్లల్ని కనాలట. ఏముందిపని! ఒక విజ్ఞానమా! వినోదమా! అందరిమొహాన గట్టిగానే అనేసింది. అందరూ కూడా వుక్కిరి బిక్కిరయి కూర్చున్నారు.

చంద్రం డాక్టరు. ఎన్నెన్నో రోగాలు కుదిర్చివేస్తున్నాడు. తన విషయం మాత్రం చూసుకోటంలేదు. పెళ్ళంటేసరి పిచ్చియెత్తి పోతుంది. సంబంధంకోసం యెవరైనా వస్తే, పళ్ళు పటపట మనిపిస్తాడు చంద్రం మహా బిరుసు. ఒకళ్ళ మాట వినేఘటంకాదు. తనకు యెంతతోస్తే అంతే తప్పగాని, వప్పగాని. ప్రాక్టీసు అమోఘంగా వుంది. ప్రొద్దున్నుంచి సాయంత్రందాక యేవో కేసులు చూస్తూనే వుంటాడు. ఆసమయంలో యెంతైనా ఆనందంగానేవుంటుంది. కాని తనకు తెలీకుండానే తన మనస్సులో అదో విధమైన అసంతృప్తి చెలరేగుతూవుంది. దానికి కారణం ఫలానాఅని చంద్రానికి తెలియటంలేదు. అసంతృప్తిని వెనక్కు నెట్టేసుకుంటూ ముందుకు చొచ్చుకు పోతున్నాడు.

'సుజాతకు యెంతహాయో! నిక్షేపంగా ప్రాక్టీసు సాగిపోతోంది రికామిగా కాలం గడిపేస్తోంది'...

'చంద్రం మనిషంటే మనిషి! హాయిగా యేజంఝాటమూ లేకుండా నిరామయంగా జీవితం గడిపేస్తున్నాడు.'

'ఎక్కడ పోలికలు వచ్చినాయోకాని యింటా వంటా లేవు. పెళ్ళి చేసుకోం అని కూర్చున్నారేమంట...

నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటున్నారు. చంద్రం సుజాత లిద్దరుకూడా లోకాన్ని చూసి నవ్వుకుంటున్నారు. సుజాత యింతమారిపోవటాన్ని చూస్తే అందరికీ ఆశ్చర్యంగానే వుంది. చంద్రం అవుతే నాకు చిన్నప్పటి నుంచి పరిచయమే. చంద్రాన్నిపట్టి సుజాతతోకూడ కొంత పరిచయమే. నేనూ, చంద్రం ఆడుకుంటున్నప్పుడల్లా సుజాత వస్తూవుండేది మాదగ్గరకు. మా యిద్దరికీ చాలా వుత్సాహంగానే వుండేది. ఎందువలనో కాని, సుజాత తల్లి మాత్రం, ఆడపిల్లవి, మగపిల్లలతో ఆడుకుంటారుటే అంటూ సుజాతను చెయ్యిపట్టుకుని యింటికి తీసుకువెళ్ళేది. తర్వాత తర్వాత, నేనుకూడా ఒకటి రెండుసార్లు నువ్వు ఆడపిల్లవీ, మాతో ఆడుకోటానికి వస్తావేమిటి అంటూ సుజాతను ఎగతాళిచేశానుకూడ. సుజాతకు చాలా కోపంవచ్చేది. ఎంతో విసుగ్గా ఏవోమాటలు అని వెళ్ళిపోయేది. మా ముగ్గురిలోను చంద్రానికి పేరు ప్రఖ్యాతులు అప్పట్లోనే రావలసిన దానికంటే యెక్కువే వచ్చినాయి. నిజానికి చంద్రానికంటె సుజాత అప్పట్లో బుద్ధిమంతురాలనిపించుకుంది. మేమిద్దరం ఒకే సెక్షనులోవుండే వాళ్ళం. చంద్రం బి. సెక్షననుకుంటాను. సెక్షను ఒకటి అవటంవలన నేనూ సుజాతా కలిసి చదువుకోటం, కలిసి బళ్ళోకి పోవటంకూడా జరుగుతూ వుండేది. మెట్రిక్యులేషన్ పరీక్షకుకూర్చున్నప్పుడు మాత్రం సుజాతతో మాట్లాడటం యేమిటోగా అనిపించింది. సుజాతకూడా కొంత ముభావంగా వుంటున్నట్లు నాకు తోచింది. ఓసారిమాత్రం నాకుబాగా జ్ఞాపకం. ఏదో పుస్తకం యివ్వాలనివచ్చి నా దగ్గరకు రావటానికి జంకింది. వెంటనే చంద్రాన్ని పిలిచి "ఓరేయ్ అన్నయ్యా యీ పుస్తకం మధూకు యిచ్చెయ్యి" అన్నది. నేను ప్రక్కనే వున్నట్లు సుజాత గమనించలేదు. నేనురావటంచూసి నా కళ్ళలోకి అప్రయత్నంగా చూసి నవ్వింది సుజాత. ఆ ఘడియలో సుజాత కళ్ళల్లో యెన్నడూ చూడని అందం, క్రొత్తదనం, నా హృదయానికి తట్టినాయి. ఆ నిముషంలో యెంతో వుత్సాహం, ఆసక్తి, ఓ విధమైన ఆశ యేవేవో పల్లవించినాయి. అనేకరకాల కోరికలు వూహాలు, నా మనస్సులో అలల్లాగ వూగిపోయినాయి. తర్వాత ఓవారం దాక నేను సుజాత యింటికి వెళ్ళనేలేదు. ఓసారి గాబోలు బయట సుజాత యెక్కడో కనిపిస్తే నేరంచేసినవానిలాగ తప్పించుకుని వెళ్ళిపోయాను. సుజాతనావైపు ఆదోరకంగా చూసినట్లు అనిపించింది. చంద్రాన్ని

చూడటం అంటే కూడా నాకు కొంచెం బెదురుగానేవుంది. నేను అనుకొన్న కోరిక సఫలంకాకపోవటానికి, కారణం సుజాత ఇంటర్ చదవటమేనని అప్పట్లో నామూఢవిశ్వాసం.

చంద్రానికి వయస్సుతోపాటు, అప్పట్లో అనుకుంటున్న రౌడీతనంకూడా పెరిగిపోయింది. చంద్రంనోట్లో మాట దాగేదికాదు. అన దలుచుకున్నదేమిటో అనేశేవాడు. నాలో చెలరేగిన భావాలు చంద్రం గ్రహించినట్లు ఒకటి రెండుసార్లు సూటిపోటిమాటలుకూడా అన్నాడు. ఈ విషయం చంద్రానికి యెట్లా తెలిసిందా అని నేను ఆశ్చర్యపోయాను. నిజానికి చంద్రానికి యేదికూడా తెలియదు. చంద్రం యెవరినీ లెక్కచెయ్యకపోవటం అతని పద్ధతి చూస్తుంటే అందరికీకూడా అతను పెద్దవాడు అయిపోయిన తర్వాత యెట్లా మారిపోతాడో అనే ఓవిధమైన భయం వేసేది అతను యేవిధంగా మారిపోతాడో అని యెవరూ ఫలానా అని వూహించకపోయినా, మొత్తంమీద, చంద్రాన్ని గురించిన మంచి అభిప్రాయం అప్పట్లో యెవరికీ కూడా కలిగేటట్లు అతను ప్రవర్తించలేదు.

సుజాతమాత్రం ఇంటర్ పరీక్ష ప్యాసయినప్పటినుంచీ పూర్తిగా మారిపోయింది. మారిపోవా లనుకుందికూడా యేమో! ఇంట్లో అంతమంది వుంటే సుజాత వక్కతే యిట్లా మారిపోవాలా అని అందరికీ ఆశ్చర్యంవేసింది. నలుగురు అప్పలు, యిద్దరు అన్నలు, ఒక తమ్ముడు. ఎవరికీ కూడా సుజాత పోలికరాలేదు. సుజాత వంటరిగా ఆలోచిస్తూ కూర్చుంటే, తనతోబుట్టువు లందరు వరసగా కళ్ళల్లో మెసిలేవారు. అమ్మమీద విపరీతమెన జాలివేసేది. నాన్నమీద పట్టరానికోపంవచ్చేది. ఏవేవో అనుకునేది. ఏవేవో విసుక్కునేది. ఎంతో వుక్రోషంతో యింట్లోంచి గభాలున లేచివెళ్ళిపోయేది. ఇవన్నీ వివరంగా నాకు చంద్రం చెపుతూవుండేవాడు. నేనూ అట్టే ఆలోచిస్తూ యేనిర్ణయానికి రాలేకపోయేవాణ్ణి. నాకువున్న మూఢనమ్మకాలు, వ్యక్తులమీద విశ్వాసాలు, కొన్నివిషయాల్లో సత్యాన్ని గ్రహించటానికి ఆటంకాలుగా పరిణమించినాయి. నా నమ్మకాల్ని చంద్రం ఎదుటగాను, సుజాత చాటుగాను పరిహాసం చేస్తున్నారనికూడా నాకుతెలుసు.

ఆనాడు నాపెళ్ళికి, సుజాత కొంచెం ఆలస్యంగా వచ్చింది. సుజాతను అక్కడ చూడగానే నావళ్ళు ఝల్లుమన్నది. నాగుండె దడదడ కొట్టుకోవటం మొదలుపెట్టింది. నా పెళ్ళిలో నదురుబెదురులేకుండా సుజాత యెంతో చొరవగా యేవో విషయాలు మాట్లాడుతోంది. నేనూ అటూయిటూ చూస్తూ తడబడిపోయాను, ఎవరైనా మావంక చూస్తారేమోనని. సుజాతకు అలాంటి విషయాలేమీ తట్టలేదు. ఆరోజులు అట్లావెళ్ళిపోయినాయి.

సుజాత బి.ఏ. పూర్తిచేసుకున్న తర్వాత, తాను నిలవదొక్కుకునేశక్తి తనకు పూర్తిగావచ్చేసినట్లు గట్టిగా అనుకుంది. అప్పటినుంచి యితరుల అభిప్రాయాలకుగాని, యితరుల సలహాలకుగాని ప్రాధేయపడేదికాదు. పైపెచ్చు యెవరినీ లెక్కపెట్టకూడదనే ఒక నిర్లక్ష్యభావంకూడా యేర్పరచుకుంది. ఆపైన యెవరూకూడా సుజాతకు ఆమె విషయంలో సలహాలు యివ్వటానికి సాహసించలేదు. ఇంచుమించు చంద్రం మనస్తత్వంలోకి వచ్చేసింది సుజాతకూడ. అందువల్లనే చంద్రానికి, సుజాతకు యెంతో సన్నిహితం యేర్పడింది. ఏవిషయంలోనైనా, చంద్రం సుజాతతో చెప్పటం, సుజాత చంద్రంతో చెప్పటం తప్పనిసరిగా జరిగితీరాల్సిందే. నేనుకూడా అప్పుడప్పుడు చంద్రం డిస్పెన్సరీకి వెళుతూవుండేవాణ్ణి. ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతూవుండేవాడు. సుజాతకూడా ఆవిధంగానే వుండేది. అయితే, నేనువస్తే, పెళ్ళివిషయంలో యేమైనా అభిప్రాయం యిస్తానేమోననిమాత్రం, సుజాత చాలా జాగ్రత్తగా వుంటూవుండేది. ఆ విషయంలో నాకున్న అభిప్రాయంమీద వాళ్ళిద్దరికీకూడా యేమాత్రం గౌరవం లేదని నాకు పూర్తిగాతెలుసు, ఆవిషయం తెలిసినతర్వాత కూడా నేను జోక్యం కలుగచేసుకుంటాననుకోవటం ఫలితంగా చూస్తే సుజాత తెలివితక్కువే అనాలిసి వస్తుంది.

ఆనాడు నాపనంతా పూర్తిచేసుకుని సావకాశంగా చంద్రం డిస్పెన్సరీకి వెళ్ళాను. అక్కడ అడుగుపెట్టగానే యిద్దరు మాట్లాడుకుంటున్నట్లు వినిపించింది. కాస్త ఆగేటప్పటికి నాపేరు వినిపించింది. స్వార్థం నన్ను అక్కడే ఆపేసింది. మెల్లిగా వింటున్నాను.

'మా నాన్నకు వేరే పనేం లేనట్లుంది. ఏవుత్తరంవ్రాసినా సరే చివర పెళ్ళివిషయం యేమయిందంటూ ఓముక్క

వ్రాస్తాడు. నేను పెళ్ళిచేసుకోకపోవటం మా నాన్నకు బాధగావున్నట్లుంది...' చంద్రం వుత్తరాన్ని మడిచి జేబులో పెట్టేశాడు. సుజాత పెద్దపెట్టున నవ్వింది.

'బాబాయి యెప్పుడూ అంతే. ఆయన వుత్తరాల సంగతి మనకు తెలీదేమిటి...' సుజాత యింకా నవ్వుతూనే వుంది.

'పెద్దవాళ్ళు. వాళ్ళ భావాలు, వాళ్ళ అభిప్రాయాలు యివ్వాళ మార్చుకోమంటే మార్చుకుంటారా...'

'వాళ్ళ భావాల ప్రకారం మనం ప్రవర్తిస్తామా... రెండూ వట్టిదే...' సుజాత, చంద్రాన్ని బలపరిచింది.

'మీఅమ్మ అంతేగా... ఓపట్టాన చెపితే వినదేను. నేను కనిపిస్తే చాలు, నాతో చెప్పమంటుంది..'

'మీఅమ్మ మాత్రం చిన్నదేమిటి. ఆవిడ వయస్సు అదేగా...' అంత వయస్సువచ్చినా విషయాలేమిటో గ్రహించుకోవటానికి ప్రయత్నం చెయ్యరు. పైగా పిల్లలు తమ మాట వినటంలేదని అక్కడాయిక్కడా ప్రాపగాండా అంతకంటె యేంలేదు...'

'ఆ ప్రాపగాండాయైనా ఆ వయస్సువాళ్ళతోనే...' చంద్రం పక్కుననవ్వాడు.

సుజాతకూడా తేలికగా నవ్వేసింది.

'నేను అనుకుంటాను. మనం యేంచెప్పినా వాళ్ళ బుర్రలకు యెక్కదల్లేవుంది...'

'వాళ్ళ నిశ్చితాభిప్రాయం యేమిటో తెలుసా. మనకేం తెలీదని. అంతే. అలాంటివాళ్ళతో మనమేంచెప్పినా వుపయోగంలేదు...' చంద్రం వ్యాఖ్యానించాడు.

'నావరకు నాకు మీఅమ్మతో యెన్నో విషయాలు విప్పిచెప్పేద్దామనుకుంటూ వుంటాను కాని భయమేస్తుంది. ఏమనుకుంటుందో అని...' సుజాత ఆపేసింది.

'మనం చెయ్యదలుచుకున్న పనులుచేస్తుంటేసరి. అర్థమయినవాళ్ళకు అర్థంఅవుతుంది. అర్థంకానివాళ్ళకు వాళ్ళ ఖర్మం. మనమేంచేస్తాం...' చంద్రం మెల్లిగా లేవబోతున్నాడు.

'పనంతా పూర్తి అయిపోయిందేమిటి...'

'పూర్తి అవటం యెక్కడికిలే. కూర్చుంటే వస్తూనేవుంటారు. వెళదాం పద...' చంద్రం కోటువేసుకున్నాడు

సుజాతకూడా లేచి నుంచున్నది. వాళ్ళిద్దరూ వాకిట్లోకి వచ్చేసమయానికి తలవంచుకుని నేను గడపయెక్కాను. గభాలున నాకు యిద్దరూ కనిపించారు.

"ఇప్పుడే క్లోజ్ చేసి వెళ్ళిపోతున్నాం యింటికి" అన్నాడు చంద్రం.

"ఏంలేదు ఊరికే చూసిపోదామని వచ్చాను. రేపు యెప్పుడైనా వస్తానులే అని వెనక్కుతగ్గాను. వాళ్ళిద్దరు అటువైపుకు వెళ్ళిపోయారు. మొత్తంమీద నన్నుగురించి వాళ్ళేమనుకున్నారో వినకపోయినా, అతిముఖ్యవిషయాల్నే విన్నాననుకుని తృప్తిపడి నేనూ యింటికి వెళ్ళిపోయాను. మళ్ళీమూడురోజులుదాక మేమెవ్వరం కలుసుకోలేదు.

నాకూ పట్టుదలయెక్కువయింది. చంద్రానికి నేను పెళ్ళినిగురించి చెప్పిన విషయాలమీద అతితేలికభావం వుంది. నా అభిప్రాయాలు నిజమని నాకు గట్టినమ్మకం. ఆ అభిప్రాయాల్ని తిరస్కరించినవాళ్ళచేతే పెళ్ళివప్పిస్తే, నా ఘనత పెరిగిపోతుందని ఒకవిధమైన పట్టుదలకూడా యేర్పడింది. పెళ్ళిచేసుకోము అని శపథం చేసినవాళ్ళు కనక పెళ్ళిచేసుకోవటానికి వుద్యుక్తులుకనక అయితే నేను నూటికినూరుపాళ్ళు కృతకృత్యుడయ్యానన్నమాటే. అందువలననే చంద్రం విషయంలో కొంచెం జాగ్రత్తగాను, శ్రద్ధగాను మెలుగుతున్నాను. ఎన్నిసార్లు కనిపించినాసరే, చంద్రం ఆ శపథాన్నే పునరుద్ఘాటిస్తూ వుంటాడు. దాన్ని విఘ్నం చెయ్యాలనేదే నాపట్టుదల. నా కార్యక్రమంలో ఒకభాగం కాకపోయినా, చంద్రం మనస్సు మార్చుకుంటే మాత్రం, సుజాత కూడా వెంటనే మనస్సు మార్చుకుంటుందని నాకు నమ్మకంవుంది. అయినా సుజాత, పెళ్ళిచేసుకోను అని అన్నమాటలమీద నాకు యేవిధమైన గౌరవమూ లేదు పెళ్ళి చేసుకోవటం వలన వచ్చే ఫలితాన్ని గురించి యేర్పరచుకున్న సుజాత అభిప్రాయాలమీద, నాకుయేర్పడ్డ భావం. ఆమె తెలివితేటల్ని శంకించేటట్లుకూడావుంది.

ఆనాడు చంద్రం వక్కడే డిస్పెన్సరీలో కూర్చుని వున్నాడు. తలుపులన్నీ వేసే వున్నాయి. మెల్లిగా తలుపు తట్టిలోపలికి వెళ్ళాను. చంద్రం రమ్మనమంటూ, కుర్చీచూపించాడు చంద్రం మొహంలో యేదో నిర్వేదం తాండవమాడుతున్నట్లనిపించింది. నిస్సత్తువగాలేచి చేతిలో పుస్తకం

అలమారాలో పెట్టేసి మళ్ళీవచ్చి కూర్చున్నాడు. అట్లావున్నావేం అని అడిగాను.

"ఏంలేదు. సుజాత వస్తానంది. కూర్చున్నాను అంతే." అన్నాడు చంద్రం.

సమయం వచ్చిందికదా అని సుజాతను చూడడానికి యెవరో వస్తారని విన్నాను అన్నాను.

పెద్దపెట్టున నవ్వుతూ సుజాతకు పెళ్ళి చేసుకోవటమే యిష్టంలేకపోతే చూసేందుకు వచ్చేదెవరు? పెళ్ళి విషయం కనక యెత్తారంటే యింట్లోంచి కూడా లేచిపోతానని బెదిరించింది, అన్నాడు చంద్రం.

నేనూ నవ్వేశాను.

చంద్రం తన డిస్పెన్సరీ విషయం చెపుతూపోతున్నాడు అప్పుడప్పుడు సుజాత ప్రాక్టీసు విషయము నేనూ అడిగాను. ఎంతసేపు కూర్చున్నా సుజాత అక్కడికి వచ్చే సూచనలు కనిపించటంలేదు. చంద్రానికి కూడా విసుగు పుట్టింది. ఇక వెళదాంలే అంటూ లేచాడు మేమిద్దరం సరాసరి చంద్రం యింటికే వెళ్ళాం. సుజాత చంద్రంకోసం గామాలు యెదురు చూస్తూ కూర్చుంది. నాకవుతే అక్కడ వుండటంయిష్టంలేక వెళతాను అని యింటికి వచ్చేశాను.

మర్నాడు మధ్యాహ్నం నేను తీరిగ్గా కూర్చుని యేదో పుస్తకం చదువుతూ వుంటే, చప్పున తలుపు నెట్టుకుని చంద్రం లోపలికి వచ్చేశాడు.

"మేము యివ్వాళ సినిమాకు వెళుతున్నాం. నువ్వు కూడా రావాలి. సాయంత్రం సరిగ్గా ఆరింటికి మీయింటికి వస్తాను. రెడీగావుండు. నిన్న సుజాత చేసినట్లు, నువ్వు మాయింటికిరాక, యిక్కడేవుండు. నేనేవస్తాను అంటూ హడావిడిగా బైటకు వెళ్ళిపోతున్నాడు.

నాకేం అర్థంకాలేదు. ఇంతతొందరగా రావటం యీ విషయం చెప్పిపోవటం నేనూ గబగబా వాకిట్లోకి వెళ్ళాను. చంద్రం చంద్రం అని రెండుసార్లు పిలిచాను.

"నువ్వు యింటిదగ్గరే వుండు నేనే వస్తాను." అని గబగబ అతను వెళ్ళిపోయాడు.

ఆరాత్రి సినిమాకు వెళ్లి బాగానే కాలక్షేపం చేశాం. ఆరాత్రి నేనుకూడా చంద్రం యింట్లోనే పడుకున్నాను. సుజాతకూడా యెంతో యిదిగా మాట్లాడింది. నేనూ చంద్రం చాలా ప్రొద్దుపోయేదాక యేవేవో మాట్లాడుకుంటూనే వున్నాం. ఆనాటినుంచి, చంద్రం నా దగ్గరకు వస్తూపోవటం చాలా యెక్కువయింది. చీటికి మాటికి మా యింటికి వస్తున్నట్లనిపించింది. ఎన్నో విషయాలు గంటల తరబడి నాతో చెప్పుకు పోవటం చంద్రానికి బాగా అలవాటయిపోయింది. అతనిమీద నాకు వున్న అభిప్రాయాన్ని మార్చటానికి చేస్తున్న ప్రయత్నమా అని ఒకటి రెండుసార్లు గట్టిగానే అనుమానం కలిగింది. ఏమైనప్పటికి చంద్రం ప్రవర్తనలో అనుకోని మార్పు పూర్తిగా కనిపించింది. సుజాతకూడా అదివరకు మాదిరిగా వుండటంలేదు. సుజాత వెకవెకలు, పకపకలు చాలావరకు తగ్గిపోతున్నాయి. ఆమె మొహంలో అదివరకువున్న వుత్సాహం, ఆనందం కనిపించటంలేదు. ఏదో విచారంగాను, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లు కనిపిస్తోంది. మనస్సులో ఓవిధమైన సంఘర్షణ పడుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. పైకి చెప్పటానికి వుండదగ్గ ధైర్యం ఆమెలో లోపించింది. చంద్రం యేదో నిరాశగా మాట్లాడటం, జీవితాన్నిగురించిన వేదాంతాన్ని చెప్పుకుపోవటం, నానగను నాకు చాలా కృత్రిమం అని అనిపించినాయి. అతని హృదయంలోంచి వచ్చిన మాటలుగా నాకు అనిపించలేదు. తనని తాను మోసగించుకుంటున్నాడని చంద్రం గ్రహించుకోవటంలేదు. తన ఆత్మకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడని నాకు గట్టిగా తెలుసు. కాని చంద్రంకాని, సుజాతకాని, తమకున్న అభిప్రాయాల్ని పూర్తిగా మార్చుకుని ఒక నిర్ణయానికి కనక వచ్చివుంటే, యింకా యెక్కువ బాధపడతారని నాకు తెలుసు. నిర్ణయానికవుతే రాగలగచ్చుకాని నిర్ణయాన్ని ధైర్యంగా అమలుజరపటం చూడాలి ఏమయినా, ఆ స్థితికూడా రావటానికి యెక్కువ టైముపట్టదని నాకు తెలుసు. వీళ్ళిద్దర్ని చూస్తూవుంటే నాకు చెడ్డజాలివేస్తోంది. ఒకనెలకూడా యీవిధంగా గడవలేదు.

ఆరాత్రి నిండు వెన్నెల. చంద్రం, సుజాతలు యిద్దరు షికారుకు యెంతో వుత్సాహంగా వెళుతున్నారు. నేను మొట్టమొదటగానే అక్కడ తోటలోకి వెళ్లికూర్చున్నాను. వాళ్లిద్దర్ని చూసి, నేను పిలిచాను. చంద్రం, సుజాతలు వచ్చి కూర్చున్నారు. సన్నజాజిపందిర సందులోంచి వెన్నెలధారలు మావళ్ళంతా అద్దకం వేసేసినాయి.

గులాబి అంటు, గాలికి వూగిపులాడుతూ మెల్లి మెల్లిగా వంటిని గిలిగింతలు పెడుతోంది. గులాబి రెక్కలు చల్లగా వంటిమీద తాకుతున్నాయి. మల్లెమొగ్గలన్నీ విచ్చుకుపోయి, రాలిపోతున్నాయి చిరుగాలికి ఇసుకరేణువులు మెల్లిగా జల్లువానలాగ మీద పడుతున్నాయి. ఆకాశం అంతా నిర్మలంగావుంది. అప్పుడప్పుడు కొంచెం చలిగా కూడా వుంటోంది. సుజాత నేలమీద యేదో గీస్తోంది. మళ్ళీ చెరిపేస్తోంది. కొంచెం చిరునవ్వు ఆమె మొహాన్ని అలంకరించింది. చంద్రం, నాయెదురుగా కూర్చుని, యేదో ఆలోచిస్తున్నాడు. నేను తలవంచుకొని, క్రిందపడ్డ, గులాబి రేకుల్ని, ఒక్కొకటీ తీస్తున్నాను, ఎవరి ఆలోచనలో వాళ్ళు వుండిపోయారు కొద్దిక్షణాలదాక.

ఆలోచిస్తూ, ఆలోచిస్తూనే, ఎంతహాయిగా వుంది అన్నాడు చంద్రం పెద్ద నిట్టూర్పువిడుస్తూ. నేను చంద్రం వంక చూశాను, చంద్రం సుజాతవంక చూశాడు చంద్రం యెంతో సిగ్గుపడ్డట్లు, ఆమాట తొందరగా అన్నట్లు, 'చాలా బాగుందండి వెదర్' అని చప్పున అనేశాడు నా వంక చూస్తూ చంద్రం మళ్ళీ, అసలు యీ తోటకూడా చాలా బాగుంది...' అన్నది సుజాత అటుయిటు చూస్తూ.

నేనేమి మాట్లాడలేదు.

చంద్రం యెంతో హుషారుగా మాట్లాడటానికి వుద్యుక్తుడవుతున్నట్లు కనిపిస్తున్నాడు. కాని సుజాతను చూసి తటపటా యిస్తున్నట్లు కనిపిస్తుంది. సుజాతయేవేవో చెప్పాలనుకుంటున్నట్లు కనిపిస్తోంది. కాని నేనువున్నానని ఆమెజంకుతోంది.

'నిజంగా యెంత హాయిగావుంది. ఆ డిస్పెన్సరీలో వున్నంతవరకు జైలులో వున్నట్లుగా నేవుంటుంది...' చంద్రం మెల్లిగా కోటుగుండీలు సరిచేసుకుంటున్నాడు.

'జీవితంలో హాయిపొందాలంటే, కాసేపు యిక్కడకు వస్తూవుండాలి ప్రతిరోజూను...' సుజాతకూడా వప్పుకుంది.

'అసలు శాంతి, సుఖం పొందాలంటే మానవుడు అన్ని మెట్లు దాటాలసివస్తుంది. అప్పుడే కష్టంసుఖం తెలుస్తుంది...' నేను చెప్పదలచుకున్నది పూర్తిగా చెప్ప లేను అవతల వాళ్ళ తెలివితేటలమీద నాకుమంచి గౌరవం వుంది. వాళ్ళు అర్థం చేసుకోగలరని నాకు తెలుసు.

చంద్రం నావంక చూశాడు. సుజాతకూడా తలవంచుకునే, యెంతో సిగ్గుగా నవ్వుకుంటోంది లోపల.

ఇక నేను ఆవిషయం విపులంగా చెప్పదలచుకోలేదు. కాని సుజాత, చంద్రం, నేనేమన్నా మాట్లాడతానేమోనని ఆదుర్దాగా, అతిశ్రద్ధగా చూస్తున్నారు. వాళ్ళు మనస్సు మార్చుకుంటున్నారని నాకు తెలిసిన తర్వాత, నేను ఒక వుపన్యాసం యివ్వటం అనవసరమనుకున్నాను. అయినా వాళ్ళ ఆవేశం ఆకళ్ళల్లో యెంతో స్పష్టంగా ద్యోతకమవుతోంది. కొన్ని క్షణాల్లోనే వాళ్ళూ తెలుసుకున్నారు నేనేమి మాట్లాడటంలేదని. సుజాత లాయరు ప్రాక్టీసునుగురించి, తమాషా కేసుల్నిగురించి చెపుతోంది. మేముముగ్గురం ఆనందిస్తూనేవున్నాం. చంద్రం రోగులను గురించి హాస్యంగా యేవో వివరాలు చెపుతున్నాడు. బాగా నవ్వుకున్నాం. గాలి రివ్వున వక్కసారివీచి, గులాబి అంటు తనపువ్వును వకదాన్ని సుజాత చేతిమీద పడేసింది. సుజాత వులిక్కిపడింది. మేము అప్రయత్నంగా ఒక్క వణుకువణికాం చంద్రం హృదయం వూగిపోతోంది. ఎంతో బరువుగా గులాబి రెక్కల్ని తీసేసుకుంది సుజాత. గాలి యింకొంచెం జోరుగావేయటం మొదలుపెట్టింది. సుజాతపమిటకొంగు గట్టిగా కట్టేసుకుంది. మొహానికి ముంగురులన్నీ అడ్డంవచ్చేస్తున్నాయి. ఎడంచేత్తో సుజాత వెంట్రుకల్ని వెనక్కినెట్టేస్తోంది. చంద్రం గాలికి యెదురుగా కూర్చోవటంవలన, క్రిందపడ్డ పూలరెక్కలన్నీ అతనిమీదకు కొట్టుకువస్తున్నాయి. ఈ పూలన్నీ నామీదవచ్చి పడితే యెంత బాగుండును అన్నట్లు పెద్దగా వూపిరి పీల్చాడు. సుజాత గట్టిగా తలెత్తి మావైపు చూడలేకపోతోంది.

'గాలికూడా సాగింది. వాన వస్తుందేమో. నేను యిక యింటికి వెళ్ళాలి. ఒక్కత్తేవుంది...' అని యెంతో ముక్తసరిగా వూరుకున్నాను.

నేనుఅన్నట్లుగానే మబ్బులుకూడా కదిలిపోతున్నాయి. కొంచెంగా చీకటి ఆవరించింది. వాన వస్తుందనే నమ్మకం మాకుకలిగింది. మెల్లిగా ఎంతో బరువు హృదయంతో సుజాత, చంద్రం, యిద్దరూ లేచినిలబడ్డారు. నడుస్తుంటే చంద్రం మా యిద్దరి మధ్యలోకి వచ్చేశాడు. చంద్రం

చెయ్యి సుజాత చేతికి తాకింది. సుజాత గభాలున జంకుతూ చంద్రం మొహంలోకి చూసింది. చంద్రం, యెప్పుడూ చూడని, ఆమె కళ్ళల్లో పుట్టిపడుతున్న ఆప్యాయత చూడగలిగాడు. చంద్రం ఒక్క క్షణంసేపు అప్రయత్నంగానే సుజాత కళ్ళల్లో చూశాడు. వెంటనే చంద్రం చకచక నడవటం ఆరంభించాడు. సుజాతకూడా గబగబ అడుగులేస్తోంది. వాన చినుకులు టపటప మీదపడుతున్నాయి. నేను చరచర నడిచేస్తున్నాను. వాన వెంట పడుతూనేవుంది. వాన జల్లులో మా శరీరాలు పూర్తిగా తడవక మునుపే యిళ్ళకు చేరుకున్నాం.

ఆనాడు రాత్రి నాకు స్వేచ్ఛగా నిద్రపట్టింది. తర్వాత సుజాత, చంద్రం కలిసి తిరుగుతుండగా చూడలేదు. సుజాతను చూస్తుంటే యేదో సిగ్గుగాను, భయంగాను, జంకుతున్నట్లు చంద్రం కనిపిస్తున్నాడు. చంద్రాన్ని గట్టిగా చూడటానికి సుజాత వెనుక్కు తగ్గుతోంది. సుజాత భవిష్యత్తుకు, చంద్రం దారిచూపించాడు. చంద్రం మనస్సులోని వూహలకు, సుజాత ఓరూపును యిచ్చేసింది. వీళ్ళిద్దరికి ఒకళ్ళకొకళ్ళు నిమిత్తమాత్రంగా, తమవూహల్ని కార్యరూపంలోకి మార్చుకునేందుకు తోడ్పడ్డారు. ఈ విషయం నాకు పూర్తిగా తెలిసింది. కాని చంద్రం నా యెదుటపచ్చి తన నిర్ణయాన్ని చెప్పటానికి సాహసించటం లేదు. ఈనాడు తాను అనుకుంటున్నది ఖచ్చితంగా సమర్థించేశక్తి అతనిలో అంతర్గతంగానే వుండిపోయింది. బాహాటంగా పైకి చెప్పటానికి మాత్రం సాహసించడు. తాను యేపరిస్థితుల్లో యేమి అనుకున్నాడో, యేమి అనుకోవలసివచ్చిందోకూడా నాకు తెలుసు. అయినా, నా మొహం ఎదుటపడవచ్చి అతని మనస్సులోవున్న విషయాన్ని గురించిన ప్రస్తావన తీసుకురాలేదు. చంద్రం బాధ నేను పూర్తిగా అర్థంచేసుకున్నాను. నేను వెళ్ళి స్వయంగానే అతనితో ముచ్చటిద్దామనుకున్నాను.

రెండు మూడు రోజులనుంచి, చంద్రం నాకెక్కడా కూడా కనిపించటంలేదు. సుజాత యింటికి వెళ్ళేఅలవాటు లేకపోవటంవలన, ఆమె సంగతికూడా నాకేమి తెలియటం లేదు తర్వాత డిస్పెన్సరీ దగ్గరకు వెళ్ళినా, చంద్రం జాడ తెలియటంలేదు. పైపెచ్చు చాలా మంది చంద్రాన్ని గురించి నన్ను అడగటం మొదలుపెట్టారు. నాకు అంత ముఖ్యస్నేహితుడైన చంద్రాన్ని గురించి నాకేమి తెలీదని చెప్పటంకూడా నాకు చిన్నతనం అనిపించింది. ఇంటిదగ్గర కూడ చంద్రం విషయం తెలీదన్నారు. సుజాత విషయం దర్యాప్తుచేసి కనుక్కున్నాను. రెండురోజులనుంచి సుజాత కూడా కనిపించటంలేదని ఓసారి మాటల్లోమాత్రం, నేను పట్నం వెళ్ళాలి అని యింట్లో అన్నదట సుజాత. అందువలన సుజాత పట్నం వెళ్ళిందనికూడా అనుకుంటున్నారు. చంద్రం విషయమవుతే యెవరూకూడ యేమీ చెప్పటంలేదు.

నాకూ యేమీ తోచలేదు. నేనుకూడా కొన్నాళ్ళ పాటు యెక్కడికైనా వెళదామనుకున్నాను వూళ్ళో వాళ్ళు, నాకు వాళ్ల ఆజూకి తెలుసునని, నేనుదాస్తున్నానని, నామీద అభాండాలు వెయ్యటం మొదలుపెట్టారు. వెళ్ళిపోయిన వాళ్లపని బాగానేవుంది. మధ్యవున్నవాణ్ణి నామీదకువచ్చింది.

అతితీవ్రంగా ఆలోచిస్తూ పడకకుర్చీలో పడుకున్నాను. ముందర కాగితంవుంది. బుద్ధియేమన్నా వ్రాయమని ప్రోత్సహిస్తోంది. చంద్రాన్ని గురించి యేమని వ్రాద్దామా అనేఆలోచనే పోతోంది. అనేక ఆలోచనలు తట్టుతున్నా, యేనిర్ణయానికీ రాలేకపోతున్నాను. హఠాత్తుగా ఓపెద్ద వూహ తట్టింది. వెంటనే కలం చేతపట్టాను. తలుపు సందుల్లోంచి ఓకవరు గభాలునవచ్చి నాకాలుమీదపడింది. వ్రాయబోతున్న కలాన్ని కట్టిపెట్టి, కవరు చించాను.

'ప్రియమైన మధూ నీ స్నేహితుడు...

మొట్టమొదట వ్రాసిన 'డియర్ ఫ్రెండ్' అనేమాటల్ని కొట్టేసి వుంది.

'...నా పెళ్లికి నిన్ను పిలిచేధైర్యంలేక నీకు తెలియపరచలేదు...' నాభార్య వసంత లాయరు... రెండురోజుల క్రితమే సుజాత డాక్టరు రవిని పెళ్ళిచేసుకుంది. మేమందరం యిక్కడేవున్నాం. ఒక్కసారి నిన్ను చూస్తేకాని మా మనస్సులు శాంతించవు. సుజాత మరీ మరీ వ్రాయమన్నది నిన్ను రమ్మని. నీరాకకు యెదురుచూస్తున్నాం. మిగతా విషయాలు సమక్షంలో...'

ఇట్లు,
నీ ప్రియ స్నేహితుడు,
చంద్రం.

ఇంకా నయం. యేమీ వ్రాశానుకాదుకుని, 'లక్ష్మీ! విన్నావా' అంటూ గబగబ లోపలికివెళ్ళాను.